గణపయ్య పూజకు సర్వం సిద్ధం

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో వినాయక చవితి సందడి మొదలైంది. అగ్రపూజను అందుకుని విఘ్నాలను తొలగించే వినాయకుడి పూజలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే వినాయకుడి మండపాలను సిద్ధం చేసుకుని ప్రతిమలను తెచ్చి సిద్ధంగా ఉంచుకున్నారు. శనివారం వినాయక చవితి పండగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేందుకు శుక్రవారం పూజకు అవసరమైన ప్రతిమలు, పూలు, పత్రి తదితర వస్తువులను ప్రజలు కొనుగోలు చేశారు. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, పలు దేవాలయాలు, కూడలిలలో ప్రతిమలను ఏర్పాటు చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పలుచోట్ల మట్టిగణపతులు పంపిణీ చేశారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం


మణికొండలో మట్టి వినాయకులు, పూల దండలు కొనుగోలు చేస్తున్న భక్తులు


మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తూ..


ఏసీపీ శ్రీనివాస్ తదితరులు


మణికొండలో కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి


వినాయక ప్రతిమలు, అలంకరణ సామగ్రితో మార్కెట్ సందడి..


సీబీఐటీ కళాశాలలో మట్టి వినాయకుల పంపిణీ

భగీరథ చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్


నిర్మాణదారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మణికొండ: గండిపేట మండల పరిధిలోని పుప్పాలగూడ, శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ సరిహద్దులో ఉన్న భగీరథ చెరువును శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరివాహకంలోని నిర్మాణాలు, జరిగిన ఆక్రమణలను ఆయన పరిశీలించారు. చెరువును ఆనుకునే లేఅవుట్‌లు చేయటం, వాటిల్లో నిర్మాణాలు రావటాన్ని ఆయన గమనించారు. కొందరు షెడ్డులను ఏర్పాటు చేయటంతో అవి ఎవరివని, వాటిని వెంటనే మీరే తొలగించుకుంటారా.. లేదా తాము కూల్చివేయాలా అని ప్రశ్నించారు. దీంతో సదరు షెడ్డు యజమాని తామే తొలగించుకుంటామని చెప్పారు. గతంలో చెరువు నీరు ఎక్కడి వరకు ఉండేదని, హద్దులు ఎక్కడైనా ఉన్నాయా అనే విషయాన్ని ఆయన స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన భగీరథ చెరువులపై తమకు ఫిర్యాదులు వచ్చాయని, పూర్తిస్థాయిలో పరిశీలించి, సర్వే నిర్వహించి రాబోయే రోజుల్లో ఆక్రమణలను తొలగిస్తామన్నారు. అనంతరం హిమాయత్‌సాగర్ పరివాహకంలో వచ్చిన నిర్మాణాలపై సర్వేచేసి నివేదిక అందజేయాలని ఆదేశించటంతో వారంతా అటుగా వెళ్లారు. మణికొండ ఎల్లమ్మ చెరువు, నెక్నాంపూర్ పెద్ద చెరువు వద్దకు హైడ్రా కమిషనర్ వస్తారని స్థానికులు కొందరు చెరవుల పరిస్థితి వివరించేందుకు వేచి చూశారు. ఆయన భగీరథ చెరువు నుంచే తిరిగి వెళ్లిపోయారు.

'ఫ్రైడే డ్రైడే'లో ప్రజలు భాగస్వాములవ్వాలి


తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. హిమాయత్‌సాగర్, ఓఆర్ఆర్ రోడ్డు, ఎల్.వీ.ప్రసాద్ రోడ్లపై ఉన్న పంచర్ షాపుల వద్ద తనిఖీలు చేసి టైర్లలో ఉన్న నీటిని తొలగించి నీటి నిల్వ లేకుండా, దోమలు గుడ్లు వృద్ధి చెందకుండా చూసుకోవాలని షాపుల నిర్వాహకులకు సూచించారు. రోజూ టైర్లను పరిశీలించి అందులో నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం దోమలు పుట్టకుండా ప్రతి ఒక్కరూ ఫ్రై డే- డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలన్నారు. బిల్ కలెక్టర్ చందు, సిబ్బంది సాయి, రాము, ముడవత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పులిగుట్ట ఆలయాన్ని సందర్శించిన తోకల


డీసీపీ శ్రీనివాస్‌తో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పులిగుట్ట దుర్గమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని తొందరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌ను కోరారు. శుక్రవారం వాంబేకాలనీలోని పులిగుట్ట అమ్మవారి ఆలయాన్ని ఇరువురు సందర్శించి పరిశీలించారు. అనంతరం తోకల మాట్లాడుతూ.. ఆలయంలో శనివారం నూతన అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ జరిపించి నిత్య పూజలు జరిగేలా చూస్తానని స్పష్టం చేశారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం తప్పనిసరిగా ఉంటాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానని ఆలయ నిర్వాహకులకు చెప్పారు. మాలతి, ప్రసాద్, సీహెచ్.లావణ్య, హన్మంత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, సీహెచ్ భాగ్యలక్ష్మి, సీహెచ్. నరసింహ, ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు


మట్టితో గుంతలు పూడ్చివేయిస్తున్న పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. రోడ్లపై ఏర్పడిన గుంతల వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్,ఆర్ఐ నర్సింహగౌడ్‌లు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి కదం తొక్కారు.గుంతలను తామే పూడ్చివేయాలని అనుకున్నారు. దుర్గానగర్ చౌరస్తాలో నెలక్రితం రెడిమిక్స్ వాహనంలో మిగిలిన సిమెంట్ కాంక్రిట్‌ను గుంతలలో పోయించారు. చదును చేయడానికి పని వారు లేకపోవడంతో డ్యూటిలో ఉన్న కానిస్టేబుల్ పార చేతపట్టుకుని చదును చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుర్గానగర్ నుండి ఆరాంఘర్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. దీంతో ఇన్‌స్పెక్టర్ శుక్రవారం మధ్యాహ్నం దుర్గానగర్ చౌరస్తాలో జీహెచ్ఎంసీ ట్రాక్టర్ ద్వారా మట్టిని తెప్పించి గుంతలలో వేసి చదును చేయించారు.

పత్తికుంట ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

రాజేంద్రనగర్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని రాజేంద్రనగర్ పత్తికుంటలో భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పత్తికుంటలో ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ ఉత్సవ సమితి కో-కన్వీనర్ వై.శ్రీధర్, డీసీ రవికుమార్, ఈఈ నరేందర్‌గౌడ్, సీఐ క్యాస్ట్రో, బాబురావు, కె.దయానంద్, శ్రీధర్‌రెడ్డి, ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై పడిన భారీ వృక్షం



మైలార్‌దేవ్‌పల్లి: భారీవర్షం కారణంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మోహన్‌రెడ్డినగర్ ప్రధాన రహదారిపై ఉన్న కరెంటు తీగలపై నేషనల్ పోలీస్ ఆకాడమీ ప్రహరీలో ఉన్న భారీ వృక్షం తీగలపై పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీలో ఉన్న అన్ని ఇళ్లలో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విద్యుత్ సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్ మరమ్మతులు చేపట్టారు.

మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడికి జైలు

రాజేంద్రనగర్: మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి రాజేంద్రనగర్ ఫోక్సోకోర్టు న్యాయమూర్తి ఆంజనేయులు 20 ఏళ్ల కఠినశిక్షతో పాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తుది తీర్పునిచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలీనగర్ ప్రాంతానికి రాజుసాహు (28) ఓ స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్నాడు. కాగా అదే ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువతితో వివాహమైంది. మద్యానికి బానిసైన అతడు తరుచూ తాగొచ్చి భార్యను వేధిస్తుండటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అత్తగారి ఇళ్లు అదే ప్రాంతంలో ఉండటంతో 2019 జూలైలో అత్తాగారింటి వద్దకు వెళ్లాడు. అత్త, మామతో పాటు ఇంట్లోని వారు పనికివెళ్లడంతో వరుసకు మరదలైన మూడున్నరేళ్ల మైనర్ బాలికను రాజు సాహు తన వెంట తీసుకెళ్లాడు. అలీనగర్ ప్రాంతంలోని తన రూమ్‌కు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. రాత్రి సమయంలో రాజు సాహు అత్తకు ఫోన్ చేసి బాలిక తన వద్దే ఉందని వచ్చి తీసుకెళ్లాలని తెలిపాడు. బాలికను ఇంటికి తీసుకురాగా తల్లితో జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.8 వేలు జరిమానాను విధించారు. బాధితురాలికి రూ.3 లక్షల నష్ట పరిహారం అందించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

శంషాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలతో పాటు మండల పరిషత్ పాఠశాలతో పాటు భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి విద్యార్థులకు అడిగి తెలసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలపై మరింత నిబద్ధతగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన 20 మంది సేవలు పొందుతున్నారన్నారు.

ఎయిర్‌టేక్ మిషన్స్ పనుల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రిజర్వాయర్లతో పాటు ఎయిర్‌టేక్ మిషన్ల పనులను శుక్రవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి పరిశీలించారు. పిల్లర్ నంబర్ 191 వద్ద ఎయిర్‌టేక్ మిషన్ ద్వారా డ్రైనేజీ ఓవర్ ఫ్లో పనులను సిబ్బంది చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన సిబ్బందితో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోల్డెన్‌హెడ్స్, బుద్వేల్ తాగునీటి రిజర్వాయర్లను పరిశీలించి విషయం తెలుసుకున్నారు. 11 బుక్‌లను తనిఖీ చేశారు. జలమండలి ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం


రహదారిపై నిలిచిపోయిన వాహనాలు..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. హైదర్షాకోట్, కిస్మత్‌పూర్, పీరంచెరువు, హిమాయత్‌సాగర్, బండ్లగూడ జాగీరు, గంధంగూడ, దర్గాఖలీజ్‌ఖాన్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై వరద నీరు ఏరులై పారింది. బస్తీలు, కాలనీల రోడ్లు పూర్తిగా నిండుకుని ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అపార్ట్‌మెంట్లలో సెల్లార్‌లోకి వరద నీరు వచ్చి చేరింది.

డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన నిందితుడి రిమాండ్

శంషాబాద్ రూరల్: పట్టా భూమిని రెండోసారి రిజిస్ట్రేషన్ చేసిన అడ్వకేట్ కటకటాల్లోకి వెళ్లాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దషాపూర్‌కు చెందిన జిల్లా రమేష్ నగరంలోని సరూర్‌నగర్ నివాసం ఉంటున్నాడు. కాగా స్వగ్రామంలో సర్వే నంబరు 173/ఊ/1లో ఒక ఎకరా 14 గంటల భూమి ఉంది. ఈ భూమిని 2017లో ఓ వ్యక్తికి అమ్మి అతనికి స్వాధీనం చేశాడు. సదరు కొనుగోలుదారుడు ఈ భూమి మ్యూటేషన్ కోసం రెవెన్యూ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోగా.. పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో ధరణిలో ఈ భూమి రికార్డు రమేష్ పేరుపై నమోదై ఉంది. ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న అతడు తన పేరుతో పట్టా పాసు పుస్తకం తీసుకున్నాడు. అనంతరం భూమిని మరో వ్యక్తికి అమ్మేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా భూలావాదేవీలు, ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలను సరి చూసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: కుమార్తె ఇంటికి వెళ్లేసరికి ఇంట్లోని బంగారు ఆభరణాలతో పాటు నగదును దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదర్‌గూడ లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన లోకనాథ్‌రెడ్డి వ్యాపారి. కాగా గతవారం విజయవాడలోని తన కూమార్తె ఇంటికి భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. గురువారం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో పనిమనిషి ఇంటి వద్దకు వచ్చి పిలిచినా పలకకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని యజమానికి తెలిపింది. అతడు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుడు ఇంట్లోని 50 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 2,30,000ల నగదు చోరీ జరిగిందని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: పీవీ ఎక్స్‌ప్రెస్ వే ఫ్లై ఓవర్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన తేజేశ్వరరావు (40) షాద్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం పని నిమిత్తం షాద్‌నగర్ నుంచి ఒక కారులో ఓల్డ్ బోయిన్‌పల్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆరాంఘర్ వద్ద పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే ఫ్లై ఓవర్‌పై పిల్లర్ నంబర్ 298 వద్దకు రాగానే తనకు వాంతులు వస్తున్నాయని క్యాబ్ డ్రైవర్‌కు తెలపడంతో పక్కకు ఆపాడు. వాంతులు చేసుకుంటూనే తేజేశ్వరరావు కుప్పకూలాడు. వెంటనే కారు డ్రైవర్‌తో పాటు వాహనదారులు 108కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీమ్‌తో పాటు రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం ఈనెల 17న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని దేవాలయ వ్యవస్థాపకులు పులిగిళ్ల శ్రీనివాసచారి, యజ్ఞ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. జగన్‌మోహన్‌చారిలు ప్రకటించారు. శుక్రవారం కాటేదాన్ శాంతినగర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ విడుదల చేశారు. ఈ సందర్భంగా యజ్ఞ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ జగన్ మోహన్ చారి మాట్లాడుతూ.. జిల్లా విశ్వబ్రహ్మణ (విశ్వకర్మ)సంఘం ఆధ్వర్యంలో యజ్ఞమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ మానవాళికి విశ్వకర్మలు మూలమని, అన్ని వృత్తులకు ఆది గురువు విశ్వకర్మ భగవానుడు అని చెప్పారు. కాసోజు మాధవచారి, పులిగిళ్ల జ్ఞానేశ్వర్‌చారి, మారోజు నరేంద్రచారి, బ్రహ్మచారి, రాంపల్లి రవీంద్రచారి, పులిగిళ్ల రమేష్‌చారి, మహేష్ చారి,యదిలీప్‌చారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు కడితే జరిమానా


కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: వినాయక చవితి పండగను పర్యావరణానికి హాని కలగకుండా నిర్వహించుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి సూచించారు. రోడ్ల పక్కన ప్లాస్టిక్ ఫ్లెక్సీలు కడితే వాటిని వెంటనే తొలగించటంతో పాటు కట్టిన వారికి జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నీటి బాటిళ్లు, ప్లేట్లను వాడొద్దని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తమ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.